# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 24-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారతదేశ అభివృద్ధిలో ఒడిశా కీలక పాత్ర పోషిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ రేపటి నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఏ అంశంపైనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు తెలిపారు.
- ❖ యువతలో క్రమశిక్షణ పెంపొందించడంలో నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్.ఎన్.సి.) పాత్ర కీలకమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.
- ❖ తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కేరళ, మహే, కోస్తాంధ్ర, యానాం, రాయలసీమల్లో రానున్న 4-5 రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.

==========================

గురు తేజ్ బహదూర్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఈ రోజు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనకు నివాళులర్పించారు. గురు తేజ్ బహదూర్ గొప్ప ఆధ్యాత్మిక మార్గదర్శి, నిజమైన దేశభక్తుడని, ప్రేమ, ఐక్యతను ప్రోత్సహించి సత్యం, న్యాయం కోసం పోరాడమని ప్రజలను అతను ప్రోత్సాయించారని సామాజిక మాధ్యమం వేదికగా రాష్ట్రపతి పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ కూడా సామాజిక మద్యమ వేదికగా గురు తేజ్ బహదూర్ కు నివాళులర్పించారు. మానవాళి ప్రాథమిక హక్కులను పరిరక్షించడంలో ఆయన చేసిన అసమానమైన త్యాగం రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోతుందని ఉపరాష్ట్రపతి తెలిపారు.

==========================

యువతలో క్రమశిక్షణ, నాయకత్వం, సేవా స్ఫూర్తిని మరింత పెంపొందించడంలో నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్.ఎన్.సి.) పాత్ర కీలకమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. దేశ ప్రజలతో ప్రధానమంత్రి తన మనసులో మాటను పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమం 116వ సంచిక ఈ రోజు దూరదర్శన్, ఆకాశవాణిల ద్వారా ప్రసారం అయ్యింది. ఈ కార్యమక్రంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ.. తాను స్వయంగా ఎన్‌సిసి క్యాడెట్ ని కావడంతో, దాని నుండి పొందిన అనుభవం వెలకట్టలేనిదని పూర్తి విశ్వాసంతో చెప్పగలనని తెలిపారు. దేశంలో ఎన్‌సిసిని బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి జరుగుతోందని, అత్యధిక సంఖ్యలో ఎన్‌సిసిలో చేరాలని యువతను కోరారు. వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో ఎన్‌సిసి గొప్ప సహాయం చేస్తుందని అనుభవం ద్వారా తెలుసుకుంటారని నరేంద్ర మోడి తెలియజేస్తూ...

(వాయిస్ 37 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రేపటి నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఏ అంశంపైనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ రోజు అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం మంత్రి కిరెన్ రిజిజు విలేకరులతో మాట్లాడుతూ, లోకసభ, రాజ్యసభ సమావేశాలు సజావుగా జరిగేలా చూడాలని ప్రతిపక్ష పార్టీలను కోరారు. శీతాకాల సమావేశాలు రేపు ప్రారంభమై డిసెంబర్ 20 వరకు కొనసాగుతాయని కిరెన్ రిజిజు పేర్కొంటూ...

(వాయిస్ 42 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

55వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో (ఈఫీ) క్రియేటివ్ మైండ్స్ ఆఫ్ టుమారో (CMOT) ఫలితాలు ఈరోజు ప్రకటించారు. టీమ్ గ్రీన్ రూపొందించిన గుల్లు చిత్రం ఉత్తమ చిత్రం అవార్డుతో పాటు 5 లక్షల రూపాయల నగదు బహుమతిని కూడా గెలుచుకుంది. ఇదే చిత్రానికి చెందిన పుష్పేంద్ర కుమార్ ఉత్తమ నటుడు అవార్డును గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పుష్పేంద్ర స్పందిస్తూ.. అవార్డు రావడం అద్భుతమైన అనుభవంగా అభివర్ణించారు. యువ చిత్ర నిర్మాతలు తమ లఘు చిత్రాలను సకాలంలో పూర్తి చేయడంలో సహకరిస్తున్నందుకు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాకు కృతజ్ఞతలు తెలిపారు. లవ్‌ఫ్లిక్స్ సబ్‌స్క్రిప్షన్ అనే చిత్రానికి విశాఖ నాయక్ ఉత్తమ నటి అవార్డును అందుకుంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ అభివృద్ధిలో ఒడిశా కీలక పాత్ర పోషిస్తోందని, దేశం, ప్రపంచవ్యాప్తంగా ఆరాధించే సాంస్కృతిక వారసత్వాన్ని వరంగా పొందిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ రోజు న్యూఢిల్లీలో జరిగిన ఒడిశా పర్బా-2024 కార్యక్రమంలో ప్రధానమంత్రి ప్రసంగిస్తూ... ఒడిశా దేశానికి బలమైన నాయకత్వాన్ని అందించిందని అన్నారు. గిరిజన సమాజానికి చెందిన ఒడిశా మహిళ ద్రౌపది ముర్ము భారత రాష్ట్రపతిగా పని చేయడం అందరికీ గర్వకారణమని, ఆమె నాయకత్వం, స్ఫూర్తితో ఒడిశా గిరిజనుల సంక్షేమం కోసం వేల కోట్ల విలువైన అనేక ప్రాజెక్టులు ప్రారంభించామని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈ సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రజలకే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం గిరిజనులకు మేలు చేస్తున్నాయని ప్రధానమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కేరళ, మహే, కోస్తాంధ్ర, యానాం, రాయలసీమల్లో రానున్న 4-5 రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ఈ రోజు అంచనా వేసింది. బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, పరిసర ప్రాంతాలలో తీవ్రమైన వాతావరణం ఉండవచ్చని, మత్స్యకారులు ఈ ప్రాంతాల్లోకి వెళ్లవద్దని వాతావరణ సంస్థ సూచించింది. రానున్న 5 రోజుల్లో దేశంలోని చాలా ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతల్లో గణనీయమైన మార్పు ఉండదని IMD తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఉపఎన్నికల లెక్కింపు ఒకే రోజులో ముగిసిన నేపథ్యంలో టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ భారత ఎన్నికల వ్యవస్థను ఈరోజు ప్రశంసించారు. అమెరికా ఎన్నికలలో డొనాల్డ్ ట్రంప్ విజేతగా ప్రకటించి రెండు వారాలు గడిచినా, కాలిఫోర్నియా ఇంకా మూడు లక్షలకు పైగా ఓట్లను లెక్కించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కాలిఫోర్నియా ఓట్ల లెక్కింపులో ఉండగానే భారతదేశం ఒక రోజులో 64 కోట్ల ఓట్లను లెక్కించిందని, భారత ఎన్నికల ఓట్ల లెక్కింపుపై కథనం యొక్క స్క్రీన్‌షాట్‌ను షేర్ చేస్తూ సామాజిక మాధ్యమం "X" వేదికగా మస్క్ ఈ విధంగా స్పందించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ మూడు రోజుల పర్యటన నిమిత్తం ఈ రోజు ఇటలీ రాజధాని రోమ్ చేరుకున్నారు. ఇటలీలోని ఫ్యిజ్జిలో జరగనున్న జీ-7 విదేశాంగ మంత్రుల సమావేశం ఔట్‌రీచ్ సెషన్‌లో అతిథి దేశంగా భారతదేశాన్ని ఆహ్వానించారు. ఇటలీ, జీ-7 దేశాల ప్రతినిదులతో కేంద్రమంత్రి ఈ పర్యటన సందర్భంగా ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. అదే విధంగా రోమ్‌లో జరిగే మెడిటరేనియన్ డైలాగ్ 10వ ఎడిషన్‌లో విదేశాంగ మంత్రి పాల్గొంటారు. అనంతరం జైశంకర్ రోమ్‌లోని భారత రాయబార కార్యాలయం యొక్క కొత్త ప్రాంగణాన్ని కూడా ప్రారంభిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా పెర్త్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియాకు టీమ్ ఇండియా 534 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఓవర్‌నైట్ స్కోరు 172పరుగులతో మూడో రోజు ఆటను కొనసాగించిన భారత్.. రెండో ఇన్నింగ్స్‌ను 6 వికెట్ల నష్టానికి 487 పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. యశస్వి జైస్వాల్ 161, విరాట్ కోహ్లీ 100 పరుగులు చేసి సెంచరీలతో ఆకట్టుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ఆరంభించిన ఆస్ట్రేలియాకు భారత పేసర్లు ఆరంభంలోనే ధాటిగా బౌలింగ్ చేశారు. తొలి ఓవర్‌లోనే మెక్‌స్వీనీ (0)ని బుమ్రా డకౌట్ చేయగా, అతరువాత నైట్ వాచ్‌మెన్‌గా వచ్చిన పాట్ కమిన్స్ వికెట్ ను సిరాజ్ తీసుకున్నాడు. మార్నస్ లబుషేన్ ని బుమ్రా ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 3 వికెట్లు కోల్పోయి 12 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =